క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు

నర్వ: మండలంలోని కల్వాల్ నుంచి మక్తల్‌కు వెళ్లే రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద రాత్రి బైక్, ఆటో ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు గద్వాల్ జములమ్మకు వెళ్లి వచ్చిన ఆటో మక్తల్ వైపు వెళ్తుండగా, పెట్రోల్ బంక్ వద్ద నరేష్ అనే బైక్ రైడర్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్‌కు కాళ్లకు తీవ్రగాయాలు కాగా, అతనిని మక్తల్ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన ఆటో కర్ని గ్రామానికి చెందినట్లు పేర్కొన్నారు.

మొక్కలకు నిప్పు..

మరికల్: మండలంలోని కన్మనూర్, జిన్నారం, ఇబ్రహీంపట్నం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు మంటలో కాలిపోయాయి. రహదారులకు నిప్పు పెట్టకుండా రైతులకు గ్రామ కార్యదర్శులు అవగాహన కల్పించి మొక్కలు కాపాడాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పశువుల సంత వేలం

కోస్గిరూరల్: గుండుమాల్ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే పశువుల సంత, తైబజార్‌కు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ ఆనంద్‌కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గ్రామ పంచా యతీ కార్యాలయ ఆవరణలో 22న వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, గుండుమాల్ పేరిట డీడీ తీసి 21వ తేదీలోగా కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కార్యాలయం ముందు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎండ కాలం నీటి ఎద్దడి ఎక్కువ ఉంటుందని ప్రతి ఒక్కరు నీటిని పొదుపు చేయాలని, అలాగే తాగునీరు నిత్యం పంచాయతీ దగ్గర ఉంటుందని తెలిపారు.

చావా సినిమా ప్రదర్శన

ధన్వాడ: మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్లో మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు చావా సినిమాను ప్రదర్శించారు. హిందువాహిని అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హిందువాహిని రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. చావా సినిమాలో మనదేశంపై దండెత్తి మాతమార్పిడి కోసం ఎంత చిత్రహింసలో పెట్టేవారు అనేది క్లుప్తంగా చూపించారన్నారు. ఇందులో సుదర్శన్‌గౌడ్, ఉమేష్‌కుమార్, రవికుమార్, నవీన్‌చారి, వీరేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఊట్కూరు: అనుమతి లేని అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వరకు 25 శాతం డిస్కౌంట్‌తో రుసుం చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని, అలా చేసుకోని వారికి భవిష్యత్‌లో ఎలాంటి నిర్మాణ అనుమతులు ఇవ్వడం జరగదని తెలిపారు. మండలంలో వల్లంపల్లి, పగిడిమారి, ఊట్కూరు, పులిమామిడి తదితర గ్రామాల్లో అధికారికంగా లేఅవుట్లు లేని ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సింహరాజు, కార్యదర్శులు నాగేశ్వరి, శ్రీనివాసారావు, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎండిన పంటలు పరిశీలించాలి

మరికల్: వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు తగ్గిన నేపథ్యంలో ఎండిన వరి పంటను ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, వీరబసంత్, శ్రీని వాస్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. యాసంగిలో వ్యవసాయ బోర్లపై ఆధారపడి వరితో పాటు వివిధ రకాల తోట లు, ఆముదం పంటలు సాగు చేశారని, ప్రస్తు తం ఎండలకు బోర్లలో నీరు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. పంటలు ఎండటంతో ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టం వచ్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యాసంగిలో ఎండిన వరి పంటలతో వివరాలను సేకరించి బాధిత రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ దుకాణాల్లో బినామీలు!

- గ్రామ పంచాయతీకి నామమాత్రపు కిరాయి
- వేలానికి రానున్న దుకాణాల సముదాయం
- ఎదురు చూస్తున్న ఆశావాహులు



గ్రామ పంచాయతీ దుకాణాలు

ధన్వాడ: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీకి చెందిన దుకాణాసముదాయాలు చాలా వరకు బినామీలే నడిపిస్తున్నారు. దుకాణాలు ఒకరు అద్దెకు తీసుకొని ఇంకొకరికి అద్దెకు ఇస్తూ గ్రామ పంచాయతీకి నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నారు. దుకాణాలు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి దాకా వేలం నిర్వహించలేదు. అధికారులు వేలం వేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31లోపు అద్దె పూర్తిగా చెల్లించాలని, అనంతరం దుకాణాల సముదాయం వేలం వేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తక్కువ అద్దెకు దుకాణాలు..

మొత్తం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 17 దుకాణాలు ఉన్నాయి. వాటితో పాటు చిన్నషాపులు రెండున్నాయి. వాటిని నిర్మించి దాదాపు 20 ఏళ్లు అవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇతర షాపుల కిరాయి, పంచాయతీ దుకాణాల అద్దెలో చాలా వ్యత్యాసం ఉంది. బస్‌స్టాండ్ వద్ద ఉన్న రెండు షాపులకు కేవలం రూ.2500 అద్దె మాత్రమే ఉంది. అదే ప్రైవేట్ షాపుల కిరాయి రూ.7వేల పైనే ఉంటుంది. ప్రతిసారి నోటీసులు ఇచ్చిన తరువాతనే అద్దె చెల్లిస్తునారు. ఇలా చాలా షాపుల అద్దె పెండింగ్‌లో ఉంది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీకి రూ.40 నుంచి రూ.50 వేల అద్దె రావల్సి ఉంది.

దుకాణాలు నడిపే వారు బినామీలే..

దుకాణాలు ఒకరు తీసుకొని వాటిని ఇంకొకరికి అద్దెకు ఇస్తున్నారు. పంచాయతీకి రూ.1500 అద్దె ఉండగా, ఇతరులకు రూ.5వేలకు అద్దెకు ఇస్తున్నారు. ఇలా సగానికిపైగా దుకాణాలు బినామీలకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వేలం వేసేందుకు సిద్ధమవుతున్నాం..



గ్రామ పంచాయతీ దుకాణాలు వేలం వేసేందుకు జిల్లా అధికారులకు కనీస అద్దె ధర నిబంధనల వివరాల కోసం పంపించాం. అక్కడి నుంచి నియమనిబంధనలు రాగానే సంత వేలంతో పాటు పంచాయతీ దుకాణా లు వేలం వేస్తాం. ప్రస్తుతం పంచాయతీ దుకాణాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు అందజేశాం. అద్దె మార్చి 31లోపు పూర్తిగా చెల్లించాలి.

– శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శి, ధన్వాడ

సొంతభవనాలను నిర్మించాలి

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: నారాయణపేట నియోజకవర్గంలోని ధన్వాడలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం కేటాయించాలని, మరికల్ మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ప్రస్తావించారు. కోయిలకొండ బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో స్థాయికి మించి విద్యార్థులు ఉన్నారని, నూతన భవనం మంజూరు చేయాలని, ప్రభుత్వ ప్రాక్టిసింగ్ హైస్కూల్ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. వెంటనే కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీలకు సొంత భవనా లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరిందని, వాటిని పునర్‌నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంబంధిత మంత్రులకు, సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు.

ఎమ్మెల్యే విన్నపానికి మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ ఎమ్మెల్యే విన్నవించిన విద్యకు సంబంధించిన సమస్యలను నోట్ చేసుకున్నామని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



గుడిగండ్లల్లో కంటి వైద్యశిబిరం ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్/మక్తల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఏడుగురికి అద్దాలు అవసరం ఉండడంతో అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శృతి, వైద్య బృందం అబ్దుల్ ముజీఫ్, అనంతలక్ష్మి, టీచర్లు భాను ప్రకాష్ పాల్గొన్నారు.

- మక్తల్ మండలంలోని గుడిగండ్లలో మంగళవారం వాకిటి శ్రీహరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కట్ట సురేష్‌లు ప్రారంభించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఏనుగొండ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 85 మందికి పరీక్షలు చేయగా, 38 మందికి కంటి పొరల సమస్య ఉన్నట్లు గుర్తించారు. కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నర్సిరెడ్డి, రమేష్, రవికుమా ర్, తిరుపతయ్య, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నూరొద్దీన్, ఏ రవికుమార్, హసముద్దీన్, బోయ నర్సింహ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



వద్వాట్‌లో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: మండలంలోని వద్వాట్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీఓ రహ్మతుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒడ్డు ఒరల పనులు జరుగుతున్నట్లు ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలు చేసిన పనులకు సంబంధించిన కొలతలు పరిశీలించారు. ఎండాకాలం ఉపాధి కూలీలు ఉదయం తొందరగా రావాలని, ఎండలు ముదురుతున్న కొద్ది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న సిబ్బంది

నారాయనపేట ఎడ్యుకేషన్: చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఎమ్‌ఎల్‌ఏ పీఏ మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో 100, 400 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రోలో అండర్ 14, 16, 18, 20 బాలురు, బాలికల విభాగంలో పోటీలు నిర్వహించి, ఈ నెల 23న హైదబాద్‌లోని కొల్లూరు గాడియం స్పోర్ట్స్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికై న విద్యార్థులను అభినందించి మాట్లాడారు.. రాష్ట్ర స్థాయిలో పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచి మన నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. నారాయణపేట మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్ గురించి ఎమ్‌ఎల్‌ఏ పర్ణికారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హారిక దేవి, విద్యాసాగర్, సవిత, అజయ్, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

5 శాతం దివ్యాంగులకు కేటాయించాలి

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం 2025 మార్చి 17న ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లో 5 శాతం దివ్యాంగులకు కేటాయించాలని, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షురాలు రాధమ్మ డిమాండ్‌చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6వేల కోట్లతో 5లక్షల మంది నిరుద్యోగులకు రూ.1లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకం ద్వారా రూ.25 వేల మంది నిరుద్యోగ దివ్యాంగులకు మేలు జరుగుతుందన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమంలో 5 శాతం ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం మిగతా కార్పొరేషన్లకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగుల కార్పొరేషన్‌కు ఇవ్వడం లేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం విధి విధానాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, రాజీవ్ యువ వికాసం పథకం అమలు కోసం కార్పొరేషన్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరణ చేసి, సమావేశంలో కాశప్ప, పి బాబు పాల్గొన్నారు.

ఘనంగా శంకర్‌లింగేశ్వర బ్రహ్మోత్సవాలు



ఊట్కూరు: మండలంలోని సమస్తాపురం గ్రామ శివారులోని ఇండ్లూరు శంకర్‌లింగేశ్వర బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం కార్యక్రమం చేపట్టారు. అనంతరం నందికోల కార్యక్రమం ఆకట్టుకుంది. సాయంత్రం భక్తులు ప్రభోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విద్యా ఉద్యోగాల్లో న్యాయం కోసమే ఎస్సీ వర్గీకరణ



దామరగిద్ద: విద్యా ఉద్యోగాల్లో న్యాయం కోసమే జరిగిన ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించి ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్ మాదిగ, రాములు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో రిలే దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో ఉప కులాలకు న్యాయం చేసేలా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఉండాలన్నారు. కార్యక్రమంలో గజలప్ప, వెంకట్రాములు, లాలు, అభిలాష, అనంతప్ప, గోవింద్, వెంకటప్ప ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


సరస్వతీదేవి ఆలయంలో విద్యార్థుల పూజలు

మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీదేవి ఆలయంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు మంగళవారం పూజలు చేశారు. ఈ నెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభ కానున్న సందర్భంగా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో హెచ్‌ఎం నాగరత్నమ్మ సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కోస్గి: రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్జఖాన్‌పేట్ గ్రామంలోని పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులకు పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వినోద్, నవీన్ ఉన్నారు.

పరీక్ష ప్యాడ్లు..



నారాయణపేట రూరల్: మండలంలోని బొమ్మనుపాడు గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో 2016–17 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

- దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు కన్నప్ప, శౌర్య జువెల్లర్స్ నిర్వాహకురాలు గీత పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

- సిక్తాపట్నాయక్, కలెక్టర్



పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నర్వ: పదోతరగతి విద్యార్థులు జరగబోయే వార్షిక పరీక్షలకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా రాయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం మండలంలో ఆమె సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా పాతర్చేడ్ ఉన్నత పాఠశాల, నర్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతో పాటు, 10 జీపీఏ సాధించాలన్నారు. పాఠశాలకు శానిటేషన్ నిధులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. డీఈఓ గోవిందరాజులుకు ఫోన్‌లో సంప్రదించి నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు. నర్వ పాఠశాలలో ఏటీఎల్ ల్యాబ్‌ను పరిశీలించారు. అవసరమైన పరికరాలు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకరావాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రసుతి గది, ల్యాబ్‌ను, పరిశీలించారు. వడ దెబ్బ తగలకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. సిబ్బంది హాజరు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం యాంకి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పక్కనే ఉన్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లను చేయాలని సూచించారు. డీఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనువాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

‘పది’లో జిల్లాను మొదటి స్థానం తీసుకురావాలి



మాగనూర్ సమావేశానికి హాజరైన జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



కోస్గిలోని బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వరి

మాగనూర్/కోస్గి రూరల్/మరికల్/ మద్దూరు: మాగనూర్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో జిల్లాలో మొదటి స్థానం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్‌రెడ్డి డీఈఓను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి యాదయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ ఆనంద్‌గౌడ్, శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

- ప్రతి విద్యార్థి ఇష్టపడి, కష్టపడి చదివితేనే లక్ష్యం సులువు అవుతుందని మండల విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. కోస్గి పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం చేపట్టారు.
- మరికల్ మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో వార్సికోత్సవంలో ఎంఈఓ మనోరంజని మాట్లాడారు. మరో మూడు రోజుల్లో పరీక్షలు ఉన్నందున్న ఒత్తిడి లేకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు.
- విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో కష్టపడి చదివితే జీవితంతో అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సవిత సూచించారు. మద్దూరు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఎస్ 9వ వార్షికోత్సవం నిర్వహించారు.

నిడ్జింత పాఠశాలలో 30వ వార్షికోత్సవం



నిడ్జింత ఉన్నత పాఠశాల30వ వార్షికోత్సవంలో 10 తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత జెడ్పీహెచ్‌ఎస్ 30వ వార్షికోత్సవ సంబరాలు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. 1993లో ఉన్నత పాఠశాలగా అవతరించి 1996లో మొదటి 10వ తరగతి బ్యాచ్ ప్రారంభమైందన్నారు. నేటికీ 30 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. 2010వ లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభమైంది. నేడు ఈ పాఠశాలలో 386 మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు కవిత, జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 70 పరీక్ష ప్యాడ్లను ఉమ్మడి మద్దూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ యాదవ్ మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జూనియర్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులతో ఉన్న సాన్నిహిత్యాన్ని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ధన్వాడ మండలంలోని గోటూర్‌లో విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. 10వ తరగతి చివరి రోజులు కావడంతో తోటి విద్యార్థులు వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు.

అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయండి



అడిషనల్ కలెక్టర్ బెంచాలమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్: మక్తల్ పట్టణంలోని బీసీ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు, అంబేడ్కర్ సంఘం నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ బెంచాలమ్‌కు వినతి పత్రం అందజేశారు. సంచార తెగకు చెందిన వారు, డక్కలి తెగకు చెందిన వారు దాదాపు 60మంది పిల్లలు ఉన్నారన్నారు. అంగన్‌వాడీ సెంటర్ నుంచి వారికి ఏమాత్రం పౌష్టికాహారం ఇవ్వడంలేదన్నారు. వారి కోసం నూతనంగా అంగన్‌వాడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మక్తల్‌కు వెళ్లాలంటే దాదాపు 2కిలో మీటర్లు దూరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ కాలనీ వాసులు అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, క్రియాశీలక సభ్యులు శ్రీహరి, తేజ, రమేష్, రవికుమార్, రాజు, కాంతికుమార్ పాల్గొన్నారు.

బస్సులు నడపకుంటే ఆందోళన చేస్తాం



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: పాఠశాలకు వంటి పూట బడులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించకుంటే ఆందోళన చేస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. విద్యాసంస్థల వేళలకు బస్సుల సమయసారిని సరిచేయాలని కోరుతూ ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ డీఎం లావణ్యకు వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలలకు విద్యార్థులు సరైన సమయానికి చేరుకోవడం లేదని వాపోయారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఉచితంగా, రాయితీ పాసులను అందించి బస్సులను నడిపించాలని సూచించినా, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జిల్లా కన్వీనర్ నరేష్, నగర కార్యదర్శి సతీష్, నాయకులు వెంకటేష్, చరణ్ రెడ్డి, వివేకానంద పాల్గొన్నారు.